# భలే హాయి

"కాళ్ళు కాస్సేపు గోరు వెచ్చని నీళ్ళలో పెట్టు కోండి. పడుకునేప్పుడు కాళ్ళ కింద దిండు పెట్టు కోండి. బలానికి ఈ విటమిన్ మాత్రలు వాడండి. నెలరోజుల పాటు ఈ టానిక్ వాడండి..." అని డాక్టర్ ఇచ్చిన ప్రిస్క్రిప్షన్‌ను తు.చ. తప్పకుండా అమలు చేస్తున్నాడు ప్రకాశం. వారమైంది. కాళ్ళ నొప్పులు తగ్గడం లేదు.

ఉత్తమ గృహిణిగా సపర్యలు చేస్తూనే ఉంది వాసంతి. ఇద్దరికీ ఉద్యోగాలే. ప్రొద్దున్నే చకచకా తయారై అటొకరూ ఇటొకరూ వెళ్ళి పోతారు. సాయంత్రానికి అలసీ సొలసీ నీరసంగా ఇల్లు చేరుతారు.

అన్యోన్య దాంపత్య మనడానికి అనుమానమే లేదు.

పెళ్ళయిన రెండేళ్ళలో రుసరుసలూ బుసబుసలూ లేనే లేవు. పుట్టినిల్లు బారెడు దూరం లోనే ఉన్నా భర్త తోటిదే లోకం వాసంతికి. ప్రకాశం సరసుడూ, చతురుడూ, అతి మంచి వాడూనూ. భార్యను సాక్షాత్తూ గృహలక్ష్మిలా చూసు కుంటాడు. కష్ట పడ నివ్వడు. కష్ట పెట్టడు.

ఉద్యోగం చెయ్యక పోతే ఊసు పోదని వాసంతి పట్టు బట్టింది. సమాన హక్కులు అని ఆమె అడగ నవసరం లేదు. సమాన బాధ్యతలు అని అతనే ఇంటి పనులు కూడా మీ దేసుకుని చేస్తాడు. అవసర మైనప్పుడు అంట్లూ తోముతాడు. వంటా వార్పు కూడా చేస్తాడు.

"మీ రూరు కోండి... అసలే మీకు ఒంట్లో బాగో లేదు" అని అతన్ని టీవీ ముందు సోఫా లోనూ బెడ్ లోనూ అట్టి పెట్టేసి "మీరు ఏమీ చెయ్యొద్దు" అంది వాసంతి.

బక్కెట్‌లో వెచ్చటి వేణ్ణీళ్ళు తెచ్చి పెట్టింది. ఆ నీళ్ళలో కాళ్ళు పెట్టుకుని అతను "స్.... హబ్బా.... హమ్మా..." అని ఊరట పడుతుంటే ఆమె తల్లడిల్లి పోతుంది.

అలా అనునయిస్తూనే అతని కోసం అతని కిష్టమైన వన్నీ వండి పెడుతుంది. వంటింట్లోకి రానివ్వదు.

"నువ్వూ అలిసి పోతావు. కొంచెం రెస్ట్ తీసుకో..." అని అతనంటే "నాకేం రాయిలా ఉన్నాను.... అయినా మీకు చెయ్యడాని క్కాకుంటే నేనున్నది ఎందు కింకా?" అని దీర్ఘం తీస్తుంది. అతను బెడ్ దిగకుండా అక్కడికే భోజనం తెచ్చి వడ్డిస్తుంది. కొసరీ కొసరీ మరీ తినిపిస్తుంది. వక్కపొడీ, సిగరెట్టూ వగైరా అతనికి అందిస్తుంది.

అతను అటూ ఇటూ పచార్లు చేస్తుంటే ఆమె భోజనం కానిచ్చేసి "ఇంకా ఎక్కువ నిలబ డొద్దు.... నడ వొద్దు.... రెస్టు తీసుకోండి" అని కూచో బెట్టి టాబ్లెట్లూ టానిక్కూ ఇస్తుంది. కాస్సేపటికి బెడ్ సర్ది పడుకో బెట్టి కాళ్ళ కింద దిండు పెట్టి పల్చటి దుప్పటి ప్రేమతో అతనిపై కప్పుతుంది.

ఓర కంటితో టీవీ చూస్తూ అతను నిమిషాల్లో నిద్రలోకి జారు కుంటాడు. కాస్సేపటికి సన్నటి గురక శబ్దం వినిపిస్తుంది. మళ్ళీ అతనిక లేవడం తెల్లారాకే.

అలిసి సొలిసి నిద్ర పోయే భర్తను అపురూపంగా చూసు కోవడం గొప్ప అదృష్టం. హాయి అంటే అది. ప్రశాంతి అంటే అది. కాని వారం రోజులుగా మనసులో గుబులూ దిగులూ మొదలై సన్నటి కరెంటులా ఒళ్ళంతా పాకింది. అదే బెడ్ మీద ఇద్దరూ వెచ్చ వెచ్చటి కౌగిళ్ళలో కరిగిన క్షణాలన్నీ మగత నిద్రలో మధుర స్మృతు లైపోయాయి.

టీవీ చూసీ చూసీ కళ్ళు పీకుతాయి. పుస్తకాలు తిరగేసినా మనసు నిలకడకు రాదు.

మెదడులో శూన్యం వెక్కిరిస్తుంది. శరీరం అణువణువూ తిరగ బడుతుంది.

ఎర్రటి మంట మధ్యలో నీలి రంగు నిలువెత్తు రహస్యం లాంటి కోరిక చెవులు కొరుకుతుంది. 'ఇంతేనా ఈ రాత్రి ఇంతేనా?..." అని.

"ఛీ....పో..." అన్నా వినదు పాడు మనసు.

దారి ఆగి పోయిన 'డెడ్ ఎండ్' లాంటి క్షణాల్లో మెదడు దిమ్మెర పోతుంది. నిద్ర పట్టదు. కళ్ళు ఎర్ర బడతాయి. ఆ ఎరుపు లోంచే అన్నట్టు సూర్యోదయ మవుతుంది.

తీరని కోరిక పేరుకు పోయిన శరీరం ఏం చెప్పినా వినదు. మొండి కేస్తుంది. విసిగిస్తుంది.

పొద్దున్నే అతను మేలుకో గానే తయారై స్కూట రెక్కి తుర్రు మంటాడు. ఆమె బస్సెక్కి వెళ్తుంది ఆఫీసుకి.

వార మంటే ఏడు రోజులా ఒక యుగమా? ఆరోగ్యం కాస్త దెబ్బ తింటే ఇంత ఘోర మని ఇప్పుడిప్పుడే తెలుస్తోంది వాసంతికి. సాయంత్రం ఇంటి కొస్తుంటే కళ్ళ ముందు మెదిలేది వేణ్ణీళ్ళ బక్కెట్టే! అతనికోసం!

ఆదివార మైనా ఆఫీసు పనుంది అంటూ ప్రొద్దున్నే స్కూట రేసుకుని వెళ్ళి పోయాడు ప్రకాశం.

వాసంతి ఇంటిపనితో సతమత మవుతుండగా అనుకోకుండా ఊడిపడింది నానమ్మ. అరవై అయిదు దాటినా హుషారు తగ్గలేదు ఆవిడకి. ఏదో పని పెట్టుకుని అటూ ఇటూ తిరిగేస్తూ ఉంటుంది. మెళ్ళో సెల్‌ఫోన్ తగిలించుకుని ప్రపంచాన్ని పలకరించేస్తూ ఉంటుంది.

"నీ ఫోనేంటే ఆఫ్ చేసే స్తున్నావు చీటికీ మాటికీ.... అస లటువైపు రావడమే మానేశావ్..." అంటూ దీర్ఘం తీస్తూనే ఇల్లంతా ఒక్క చూపుతో పరీక్ష చేసేసింది నానమ్మ. ఆ వెంటనే మనవరాలి ముఖంలోకి గుచ్చి గుచ్చి చూసి "ఏంటలా వున్నావ్! ఏమైం దసలూ?" అని ఆరా తీసింది. ఏదో అయ్యుం డాలనే ఆమె తీర్మానం.

"ఏముంది నానమ్మా....అంతా ఓకే.... క్షణం తీరిక ఉండ ట్లేదు" అని వాసంతి నసుగు తుండగా నానమ్మ బెడ్‌రూమ్ కూడా సర్వే చేసే సింది. టేబుల్ మీద టాబ్లెట్లూ టానిక్కూ ఆమె కళ్ళ పడనే పడ్డాయి. ఇక దాచేస్తే దాగు తుందా? నిమిషాల్లో కూపీ లాగేసింది. ప్రకాశం కాళ్ళ నొప్పులూ నడుము నొప్పీ వేణ్ణీళ్ళ బక్కెట్టూ కాళ్ళ కింద దిండ్లూ అంతా చెప్పేసింది వాసంతి.

"ఆహా.... బావుందే.... అంతా ఓకే అన్నావు.... ఓకే అంటే ఇదే నన్న మాట..... అవతల మీ అమ్మకైనా చెప్ప లేదే ఇదంతా నువ్వూ..... డాక్టర్ చెప్పిన వైద్యం బాగానే ఉంది..... ప్రతి రాత్రీ కాళ్ళ కింద దిండ్లూ.... వేణ్ణీళ్ళ బక్కెట్టూ..... అబ్బాయ్ నిద్రపోయే దాకా నువ్వీ సపర్యలు బాగానే చేస్తున్నావ్..." అంది నానమ్మ ఆమె వైపు చూస్తూ.

"మరేం చెయ్యను నానమ్మా?.... ఊరికే తిరగొ ద్దంటే వినరు.... ఇవాళ ఆదివారం పూట కూడా ఆఫీస్ పనంటూ వెళ్ళి పోయారు కదా..." అంది అసహాయంగా.

"సరేలే.... వెళ్ళనీ.... రానీ.... నువ్వూ ఆఫీసుకు వెళ్తావూ వస్తావూ....

ఇద్దరూ అలిసీ సొలిసీ వస్తారు.... ఓపిక లేక నిద్ర పోతారు అటూ ఇటూ.... నీ మొహం ఎట్లా బిగుసుకు పోయిందో, పీల్చుకు పోయిందో తెలుసా?"

"అదేంటి నానమ్మా.... బాగానే నిద్ర పోతున్నానుగా"

"ఆహా... నిద్ర సరేలే... ఎవరంతట వాళ్ళు నిద్ర పోవడం సరేలే..." అంటూ వాసంతిని నెమ్మదిగా రెక్క పుచ్చుకుని మెత్తగా నొక్కి అడిగింది నానమ్మ.

"వారం రోజులుగా.... స్టాప్ అయిపోయింది. కదూ?"

నానమ్మ అలా అడిగేసరికి వాసంతి బుగ్గలు గబుక్కున ఎర్రబడి పోయాయి. తల తిప్పుకుంది. "ఛీ..." అని చిన్నగా నానమ్మను విసుక్కుంది వాసంతి.

ఆ తరువాత నానమ్మ అనునయం రకరకాలుగా సాగింది. ఇట్లాంటివి పుస్తకాల్లో రాయరు. క్లాసుల్లో చెప్పరు. చిక్కు లొస్తే ఎవ్వరూ ఆదుకోరు. ఒక్క నానమ్మ తప్ప. అనుభవం ఉండాలి. ఆప్యాయత ఉండాలి.

"ఒసే పిచ్చిపిల్లా! భగవంతుడు నడుమూ కాళ్ళూ ఇచ్చింది స్కూట రెక్కి తిరగడానికీ ఆఫీస్ కుర్చీల్లో గంటల తరబడి నలిగి పోవడానికీ కాదు.... చెయ్యాల్సినవి చెయ్యకుండా చెయ్య కూడనివి ఎక్కువ సేపు చేస్తే నొప్పులు రాక ఏమొస్తాయి?.... అబ్బాయ్‌కి బక్కెట్టూ, దిండ్లూ అమరిస్తే సరా? భార్య అంటే బక్కెట్టూ దిండూ ఏర్పాటు చేసే మనిషేనా? నౌకర్లూ నర్సులూ చెయ్య లేనిదీ భార్య మాత్రమే చెయ్య గలిగేదీ ఏమిటో నీకు తెలియదా?". నానమ్మ చెప్తూ ఉంటే ఇష్టం లేనట్టే వింటూ ఉండి పోయింది వాసంతి. తల వంచి మొహం తిప్పుకుంది. కానీ చెవులు మాత్రం నానమ్మ మాటల్ని ఆత్రంగా లాగేసు కుంటున్నాయి.

"ఈ కాలం ఆడ పిల్లలకి సమాన హక్కుల గురించి మాట్లాడ్డం తెలుసే గాని సరసాల్లో చిక్కుల గురించి ఆలోచించడం తెలీదులే.... ఆడా మగా అన్నాక అందాలూ అలంకారాలే కాదు.... అలుపూ సొలుపూ వచ్చినప్పుడు సులువూ సూక్ష్మం తెలియాలే వెర్రిపిల్లా.... ఆడది పాదదాసి అంటే పాత చింతకాయ పచ్చడి అంటారు కాని అందులో ఎంత సారస్యం ఉందో ఈ కాలం వాళ్ళకి తెలుసా?

"ఇప్పుడన్నీ పిచ్చి డ్యాన్సుల సినిమాలేగా? పోనీ పౌరాణిక సినిమాలు కూడా రావడం లేదూ.... పాత సినిమాలూ, శిల్పాల కేలండర్ బొమ్మలైనా గుర్తు చేసుకోవూ?.... పాల సముద్రంలో ఆదిశేషుడి పైన చిద్విలాసంగా పవళించే

శ్రీమన్నారాయణుడికి పాదాల వైపు కూచునే ఉంటుంది శ్రీ మహాలక్ష్మి.... నిరంతరం పాద సేవ చేస్తూనే ఉంటుంది.... ఎందుకటా? ఆవిడకేమీ పని లేకనా!"

"ఎందుకు నానమ్మా?"

"ఏడేడు లోకాలూ తిరిగి వచ్చే స్వామి ఎంత అలిసి పోయాడో... ఆ పవిత్ర పాదాలు ఎంత అలిసి పోయాయో నని... అమృత మయమైన తన మృదు కరకమలా లతో స్వామి పాదాలు ఒత్తుతూ ఉంటుంది ఆ ఇల్లాలు.... ఏం? వేణ్ణీళ్ళ బక్కెట్టు పెట్ట లేకనా? స్వామి కాళ్ళ కింద దిండ్లు పెట్ట లేకనా? టాబ్లెట్లు ఇవ్వ లేకనా?"

పక్కున నవ్వింది వాసంతి. " ఆ తల్లికి ఆఫీస్ కెళ్ళే బాధ, వంట చేసే పనీ లేదు కదా?"

"భలే చెప్పావులే!.... లక్ష్మి లేనిదే జగత్తే నడవదు.... ప్రపంచ వ్యాపార మంతా చూసేది ఆ మహాతల్లే.... బయట పని అంత చేస్తూ కూడా శ్రీవారి పాదసేవ ఎంత మనసారా చేస్తుంది చూడూ.... ఇంతకీ పాదసేవ అంతటితో ఆగి పోతుందా ఏమిటి? అదే మొద లన్న మాట.... అయితే అదేదో అభిమానం దివాలా తీసే తంతు అయినట్టు.... సుఖం కోసం మగవాడి కాళ్ళు పట్టు కోవాలా అనుకోకు.... సుఖం సంతోషం ఆనందం... చెరొకరికీ చెరొహాటీ కాదూ.... ఇద్దరికీ కలిసీ వెరసీ ఒక్కటేనే మొద్దూ..."

అలా అలా చాలా చాలా చెప్తూనే ఉండి పోయింది నానమ్మ. చాలా సేపు చెప్పి వెళ్ళి పోయింది గాని ఆమె చెప్పిందంతా వాసంతి మనసులో నిండి పోయి ఉండి పోయింది. ఆ తర్వాతే కథా కమామిషూ మారాయి.

రెండు దిండ్ల మీద పెట్టుకున్న కాళ్ళు ఆకాశంలో మబ్బుల్లో తేలిపోతు న్నట్టున్నాయి. ప్రకాశం మూలుగుతూ ముక్కుతూ సేద దీరు తున్నాడు.

రోజంతా స్కూటర్ తొక్కిన కాళ్ళేనా ఇవి? విసుగూ లేదు విరామం లేదు. పనులు ఆగవు. మనుషులు వదలరు. నిద్ర పోవాలని ఉంది. నిద్ర కమ్మేస్తూ ఉంది.

అంతలో కాళ్ళు ఇంకా తేలికై పోయాయి. కాళ్ళ కింద మబ్బులు కరిగి పోతే తను దబ్బున భూమి మీద పడిపోతా నేమోనని దడ పుట్టింది. అంతలో కాళ్ళ మీద చల్లగా మంచు తగిలింది. కాళ్ళు వాటంతట అవే సర్దు కున్నాయి.

కాళ్ళ మీద మెత్తటి పువ్వులో, పావురాలో వాలాయి. ఆ స్పర్శకి నరాలన్నీ జివ్వున చల్ల బడ్డాయి. అప్పుడు గానీ తెలీ లేదు. వాసంతి కాళ్ళ దగ్గర చేరింది. కాళ్ళిప్పుడు ఆమె ఒడిలో ఉన్నాయి. మబ్బుల్లోకి తీసు కెళ్తున్నవి ఆమె చేతులే.

ఓ రకంట చూస్తే ఆమె ఒక దేవతే. దేవతలు కాళ్ళు నిమురుతారా? నొక్కుతారా? "ఏమండీ...ఎలా ఉందీ?" అంటారా?

"హబ్బా!...." అన్నాడు ప్రకాశం. "హమ్మా.... హాయిగా ఉంది..." అంటూనే తేటగా నవ్వాడు. చాలా రోజు లైంది అతనలా నవ్వి.

అప్పు డతని పాదాలకి పూల రేకులు తగిలాయి. పూల సరాలు తగిలాయి. బొటన వేలికి చిన్న పువ్వేదో తగిలింది. మీటి చూస్తే వాసంతి మెలికలు తిరిగి పోయింది. హఠాత్తుగా రెండు పెద్ద పూల బంతులు కాళ్ళని కప్పేశాయి.

నీరసం కమ్మిన శరీరం ఒక ఇంద్రజాలంలో వెచ్చ బడింది. అతని చేతులు ఆర్తిగా అందు కున్నాయి. పొదువు కున్నాయి. ఇంకా హత్తు కున్నాయి. అతను ముడుచుకు పోయాడు. చిన్న పిల్లాడిలా గారాలు పోతున్నాడు. ఆమె చేతులు ఇంకా సేద తీర్చాయి. చాలా సేపు నిశ్శబ్దంతో ఊపిరులు ముడి బడ్డాయి. "ఏంటండీ చిన్న పిల్లాడిలా" అంటూ ఆమె హత్తుకుంది. అప్పుడే చిన్న పిల్లాడు పెద్ద వాడై పోయాడు.... చాలా రోజుల తర్వాత....

తెల్లారే సరికి ఉల్లాసంగా ఉత్సాహంగా ఉన్నాడు ప్రకాశం. నీరసమా? రాత్రి అతని నయగారాలు నయాగరాల్లా దూకడం గుర్తొచ్చింది. 'ఔరా! ఎంతలో ఎంత మార్పు!' అని నివ్వెర పోయింది వాసంతి. 'నానమ్మా యూ ఆర్ గ్రేట్!' అనుకుంది ఆమె మనసులో.

ఇక ఆ రాత్రి టాబ్లెట్లూ టానిక్కూ ఇవ్వ బోతే "ఇంకా ఎందుకూ? బాగానే ఉన్నానుగా" అన్నాడు ప్రకాశం తాపీగా హ్యాపీగా సిగరెట్టు గుప్పున ఊదేస్తూ.

వేణ్ణీళ్ళు పెట్టబోతే "ఇవాళ వద్దు లెద్దూ" అన్నాడు. పడ కెక్కాక కాళ్ళ కింద దిండ్లు పెట్ట నివ్వలేదు.

"హబ్బా... నువ్వు నా కాళ్ళు నొక్కితే చాలులే" అన్నాడు. అంతటితో సరస సామ్రాజ్యంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టడం మొదలయింది.

మర్నాడు నాన్నమ్మ ఫోన్ చేసినప్పుడు "నానమ్మా యూ ఆర్ రియల్లీ గ్రేట్" అని సిగ్గు పడుతూనే ఒప్పేసుకుని చెప్పుకుంది వాసంతి. "దిండు కన్నా

నేనే బెస్ట్! ఆయనకి పూర్తిగా కాళ్ళ నొప్పులు పోయాయి.... నడుం నొప్పా? అది అసలు ఆయన దగ్గరే లేదు...."

అవతలి నుంచి గలగలా నవ్వేసింది నానమ్మ. "మరి నీకీ సరికే చేతుల నొప్పులు వచ్చి ఉండాలే?"

"అవును నానమ్మా.... నిజమే.... ఆయనకేం? చాలా సేపు నొక్కించు కుంటారు నొక్కే ఓపిక నా కుండాలే గానీ... ఎంత నొక్కినా వద్దనే దేం లేదు.... అయ్యో పాపం అనిపిస్తుంది కదా.... కాని తర్వాత.... బాగానే ఉంటార్లే..."

"ఆహా...." అంటూ ఆరితేరిన నవ్వులు గుప్పించింది నానమ్మ. "నీ కింకా తెలివి రాలేదే..." అని ఏకి పారేసింది.

"అదేంటి నానమ్మా?" అంది వాసంతి.

"లక్ష్మీదేవి చేసే పాద సేవ చేశావు. అద్భుతంగా వుంది. అయ్య గారికి హాయిగా ఉంది....మరి.... నవ్వు సత్యభామవి కూడా కావచ్చు కదా..." అంది నానమ్మ.

"ఏంటీ? ఆయన మీద అలగాలా?"

"అల కేమిటి? కాళ్ళ వైపు అబ్బాయి కూచుంటే చాలు.... అప్పుడు ఇంకో రకం హాయి.... ఇంకో సుఖం..."

"మరి నాకు కాళ్ళ నొప్పులు లేవుగా..."

"ఆc...కావా లనుకుంటే అదెంత సేపూ? కాస్త మూలిగితే చాలు..." అంది నానమ్మ.

నానమ్మ మాటలు మనసులో గిలిగింత లయ్యాయి. మనస్సు నిండా పులకింతలే. కాళ్ళ నొప్పులు లేవు. నడుము నొప్పి లేదు. అయినా అలా నటించాలి.

"హమ్మా హబ్బా" అంటూ మూలగాలి. ఆయన్ని కాళ్ల వైపు రప్పించు కోవాలి. పాద సేవ చేయించు కోవాలి. చాలా హాయిగా ఉంటుంది. కాని కష్టపడి నటించాలి. అప్పుడు గాని మజా ఉండదు. సహజంగా నటించడం ఎలాగా అని తెగ ఆలోచనల్లో పడి పోయింది వాసంతి. తలుచుకుంటే నవ్వొస్తోంది. భలే హాయిగా ఉంది.

07.11.2008 సంచిక